క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలకు వితరణ

పెళేశ్వరం: శంఖవరం మండలం శృంగధారలోని ఎంపీపీ పాఠశాలకు మంగళవారం ఫ్యాన్లు, కుర్చీలు వితరణ చేశారు. బిక్కవోలుకు చెందిన కేపీకే క్రాప్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వీటిని పాఠశాలకు అందించింది. దాతకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.నాగ చాందిని, ఎస్ఎంసీ చైర్మన్ జలమూరి సీత, యూటీఎఫ్ నాయకురాలు గోపి స్వరాజ్య లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

రాజానగరం: స్థానిక అన్నదాన సత్రం కల్యాణ మంటపంలో బుధవారం క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడేనికి చెందిన ఆత్మబంధువులం సేవా సంఘం సహకారంతో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుంది. ఈ సందర్భంగా సీఐ వీరయ్య గౌడ్ మాట్లాడుతూ క్యాన్సర్ ప్రమాదకారి అయినప్పటికీ ముందుగానే గుర్తించి, సరైన వైద్యం అందిస్తే ఎటువంటి ప్రమాదం ఉండదన్నారు. ఈ శిబిరంలో మెమొగ్రఫీ (రొమ్ము భాగంలో), పాప్స్మియర్ (గర్భాశయం), ఎక్స్‌రే (గొంతుక, రిబ్స్) పరీక్షలను గ్రేస్ ఫౌండేషన్ (హైదరాబాద్) పర్యవేక్షణలో ఉచితంగా చేస్తారన్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన రిపోర్టులను సంబంధిత వ్యక్తుల సెల్ ఫోన్లకు పంపిస్తారన్నారు.

బంగారు రూపుల పంపిణీ

సీతానగరం: బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమంలో భాగంగా విశ్వహిందూధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు, పద్మావతి దంపతుల చేతుల మీదుగా 150 మంది మహిళలకు బంగారు రూపులు పంపిణీ చేశారు. స్థానిక రాజుగారి ఫంక్షన్ హాల్లో మంగళవారం బంగారు వరలక్ష్మి కానుక - 3 లక్కీ డ్రా కార్యక్రమం నిర్వహించారు. లక్కీ డ్రాలో గెలుపొందిన ముస్లిం, క్రిస్టియన్ మహిళలకు రూపులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో హైందవ చైతన్యం తీసుకురావడానికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కులమతాలకు అతీతంగా మహిళలు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

వక్తృత్వ పోటీలో ప్రథమ బహుమతి


పూర్ణ విజయదుర్గ

సీతానగరం: సమాచార హక్కు చట్టంపై రాజమహేంద్రవరం ఎన్ఆర్ఎల్ పరిధిలోని ఆరు కళాశాలల్లో నిర్వహించిన వక్తృత్వ పోటీలో సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎం.పూర్ణ విజయదుర్గ ప్రథమ బహుమతి సాధించింది. ఈ విషయాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు మంగళవారం తెలిపారు. సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి 20 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో బీకామ్ సెకండియర్ విద్యార్థిని విజయదుర్గ ప్రతిభ చూపింది. తద్వారా జోనల్ లెవెల్ పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా పూర్ణ విజయదుర్గను అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి


ఊలపల్లిలో రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారులు

బిక్కవోలు: ఈ-పంటలో రైతులు తమ పంటల వివరాలు నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి శామ్యూల్ జాన్ అన్నారు. ఊలపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి పండించే రైతులు ఎకరానికి రూ.577 చెల్లించి ఈ సేవా కేంద్రాల్లో బీమా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలోని ఏఈవో కె.శ్రీనివాస్, వీఏఏలు కె.ప్రభాకర్, రాకేష్, దీప్తి, సుమిత్ర, రైతులు పాల్గొన్నారు.

కొత్త అక్రిడిటేషన్లు మంజూరు చేయాలి

అనపర్తి: పత్రికలు, మీడియా సంస్థలలో పని చేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే సీనియర్ నాయకుడు సత్తి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్‌లో ఉన్న పాత్రికేయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం జర్నలిస్టుల డిమాండ్ డే నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న విలేకరులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ప్రమాద బీమా, కుటుంబాలకు ఆరోగ్య బీమా పథకాలను అమలు చేయాలన్నారు. కోవిడ్ బారిన పడి మృతి చెందిన పాత్రికేయ కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని, సీనియర్ పాత్రికేయులకు పెన్షన్ అమలులోకి తీసుకురావాలన్నారు.

ఊరూరా.. జోరుగా..

- విచ్చలవిడిగా బెల్టు షాపులు
- లైసెన్సు దుకాణాల నుంచే మద్యం సరఫరా
- మత్తులో చిత్తవుతున్న యువత


రంగంపేట మండలంలో సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారుల దాడులు (ఫైల్)

రంగంపేట: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన కూటమి ప్రభుత్వం.. మద్యాన్ని మాత్రం ఊరూరా అందుబాటులో ఉంచుతోంది. సంపద సృష్టిస్తామని ఎన్నికల ముందు ప్రకటించిన చంద్రబాబు.. మద్యం ప్రియుల నుంచి సొమ్ములు పిండుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అనపర్తి నియోజకవర్గంలో ఊరూరా మద్యం బెల్టు షాపులు మూడు క్వార్టర్లు, ఆరు గ్లాసులు అన్న చందంగా నడుస్తున్నాయి. మద్యం దుకాణాల్లో కంటే బెల్టు షాపుల్లోనే వ్యాపారం జోరుగా జరుగుతుందంటే అతిశయోక్తి కాదు.

21 లైసెన్సుడ్ మద్యం దుకాణాలు

నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల్లోని 59 గ్రామాల్లో 80 సచివాలయాలు ఉన్నాయి. నియోజకవర్గంలో 21 లైసెన్సుడ్ మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. మండలాల వారీగా చూస్తే అనపర్తి మండలంలోని అనపర్తిలో 3, రామవరంలో 1, పులగుర్త 1, మహేంద్రవాడ 1, దుప్పలపూడిలో 1 కలిపి మొత్తం 7 షాపులు ఉన్నాయి. పెదపూడి మండలంలోని పెదపూడిలో 2, జి.మామిడాడలో 1, గండ్రేడులో 1, ఏపీ త్రయంలో 1 కలిపి ఐదు షాపులు ఏర్పాటు చేశారు. బిక్కవోలు మండలానికి సంబంధించి బిక్కవోలులో 2, పందలపాకలో 2, కొమరిపాలెంలో 1, బలభద్రపురంలో 1 కలిపి మొత్తం 6 షాపులు, రంగంపేట మండలంలోని రంగంపేటలో 1, వడిశలేరులో 1, సింగంపల్లిలో 1 కలిపి మొత్తం 3 షాపులు ఉన్నాయి.

200 పైగా బెల్టుషాపులు

లైసెన్సుడ్ మద్యం దుకాణాల పరిధిలో 200 పైగా బెల్టు షాపులు ఉన్నాయని అంచనా. ఇక గ్రామాల్లో సారా విక్రయాలు కూడా జోరుగా సాగుతున్నాయి. క్వార్టర్ బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 వరకూ అదనంగా వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మద్యం మత్తులో గ్రామాల్లో ఘర్షణలు తలెత్తుతున్నాయి. మద్యం షాపులు ప్రైవేటుకు అప్పజెప్పడంతో రూ.లక్షలు ఖర్చు పెట్టి వేలంలో దక్కించుకున్న వారు తమ సొమ్మును రాబట్టుకునేందుకు నిబంధనలకు నీళ్లొదలాల్సి వస్తోంది.


పాలమూరులో బెల్టుషాపు నుంచి ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు (ఫైల్)

నిస్సహాయ స్థితిలో అధికారులు

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు ఏర్పాటైనా నియంత్రించే స్థితిలో ఆ శాఖ లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. తమ శాఖ ఉందని చెప్పుకోవడానికే అన్నట్లుగా ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఈఎస్ స్క్వాడ్.. సారా స్థావరాలపై దాడులు చేస్తున్నారే తప్ప బెల్టు షాపులపై మాత్రం పెద్దగా దాడులు నిర్వహించిన దాఖలాలు లేవు.

గుట్టుచప్పుడు కాకుండా..

పెదపూడి మండలంలో 33 బెల్టు షాపులను వైఎస్సార్ సీపీ శ్రేణులు గుర్తించి అవి ఏఏ ప్రాంతాల్లో ఉన్నవి బహిర్గతం చేశాయి. బెల్టుషాపులకు ఆటోల్లోనూ, బైక్‌లపై మద్యం సరఫరా అవుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. బెల్టు షాపుల నుంచి అధికార పార్టీ నాయకులకు సొమ్ములు అందుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. రంగంపేట మండలంలో ఈలకొలను, జి.దొంతమూరు, ముకుందవరం, వెంకటాపురం, మర్రిపూడి తదితర గ్రామాల్లో సారా తయారీ, విక్రయాలు గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్నాయి.

ఇంటింటికీ మద్యం



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గంలో ఇంటింటికీ పథకాలు రాకపోయినా, ఇంటింటికీ మద్యం మాత్రం చేరుతోంది. ప్రతి గ్రామంలో మూడు నుంచి నాలుగు బెల్టు షాపులు నడుస్తున్నాయి. బెల్టుషాపులు ఎక్కడెక్కడ నిర్వహిస్తున్నారో బహిరంగంగా జాబితాలు విడుదల చేస్తాం. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఈ బెల్టు షాపులను మూయించాలి. లేదంటే బెల్టు షాపులకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తాం. బెల్టు షాపుల నుంచి గతంలో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎంతెంత వసూలు చేశారో ఆధారాలు కూడా ఉన్నాయి.

– డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

బెల్టు షాపులు నడిపితే ఉపేక్షించం



సారా తయారీ, అమ్మకాలు చేపట్టినా, బెల్టు షాపులు నిర్వహించినా ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం. మద్యం షాపులు ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు సారా, బెల్టు షాపులకు సంబంధించి 62 కేసులు నమోదు చేశాం. 63 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాం. నవోదయం 2.0 లో భాగంగా సారా తయారీ, విక్రయాలపై దాడులు చేయడంతో పాటు అవగాహన సదస్సులు నిర్వహించాం. ఎక్కడైనా అక్రమ మద్యం, సారా తయారీ, విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే మాకు సమాచారమివ్వండి.

– సుధ, సీఐ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, రంగంపేట

రెవెన్యూ అంశాలపై సమీక్ష


రెవెన్యూ సిబ్బందితో సమీక్షిస్తున్న ఆర్డీఓ కృష్ణ నాయక్

రాజానగరం: ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించడంతో పాటు వాటిని అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సక్రమంగా అందించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాజమహేంద్రవరం ఆర్డీఓ ఆర్.కృష్ణ నాయక్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీసీఆర్సీ కార్డు (పంట సాగు హక్కు పత్రం)లు, వాటర్ ట్యాక్స్, జీఓ నంబర్ 23 (ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానాలు), అన్నదాత సుఖీభవ, ఇతర రెవెన్యూ అంశాలపై రెవెన్యూ సిబ్బందితో మంగళవారం ఆయన సమీక్షించారు. సమావేశంలో తహసీల్దార్ జీఏఎస్ఎల్ దేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిశీలన


సీతానగరం జూనియర్ కళాశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డీఐఈవో విజయశ్రీ

సీతానగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈవో) డి.విజయశ్రీ మంగళవారం పరిశీలించారు. కళాశాలలోని సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఫేషియల్ యాప్‌లో హాజరును పరిశీలించి, సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 15 ప్రభుత్వ జూనియర్, రెండు ఎయిడెట్ కళాశాలలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ దొరబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు

స్మార్ట్ మీటర్లు మాకొద్దు బాబోయ్

- బిగించిన వాటిని తొలగించండి
- విద్యుత్ కార్యాలయం వద్ద రైతు కూలీల ఆందోళన


రాజానగరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతు కూలీలు, న్యూడెమోక్రసీ కార్యకర్తలు

రాజానగరం: విద్యుత్ పంపిణీ వ్యవస్థలో నూతన విధానమంటూ అమలు చేస్తున్న స్మార్ట్ మీటర్లు తమకు వద్దని, ఎక్కడైనా బిగిస్తే వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ప్రదర్శనగా వచ్చిన రైతు కూలీలు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. ఇందనం సర్దుబాటు పేరుతో విధిస్తున్న చార్జీలను కూడా రద్దు చేసి ప్రజలపై ఆర్థిక భారాన్ని నివారించాలని కోరారు. దేశ వ్యాప్తంగా వామపక్షాలు ఇచ్చిన పిలుపు మేరకు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జె.సత్తిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించి, స్మార్ట్ మీటర్లు ఎక్కడైనా బిగిస్తే వాటిని బద్దలు కొట్టండి అంటూ పిలుపునిచ్చిన కూటమి నేతలు.. నేడు అధికారంలోకి వచ్చాక అదే విధానాన్ని అమలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో చంద్రబాబు విద్యుత్ చార్జీలను తరచూ పెంచడం వల్లనే అధికారాన్ని కోల్పోయాడనే విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. తిరిగి ఆ పరిస్థితులు కూటమి ప్రభుత్వానికి ఎదురు కాకుండా ఉండాలంటే స్మార్ట్ మీటర్లు వినియోగించరాదని, ట్రు అప్ చార్జీలు, ఇందనం సర్దుబాటు చార్జీలు అంటూ విధిస్తున్న అదనపు బాదుడును తొలగించాలన్నారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘ ప్రతినిధులు మరుకుర్తి వీరలక్ష్మి, తుమ్మల కళావతి, బొలిశెట్టి సత్యవతి, తామర్ల గౌరీ, నక్కా లక్ష్మి, దోమ సీత, గోరచ దుర్గ పాల్గొన్నారు.

'రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం'


అనపర్తి ఏరియా ఆస్పత్రిలో సమావేశమైన ఏపీజీఈఏ సంఘ సభ్యులు

అనపర్తి: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు గిరి ప్రసాద్ వర్మ అన్నారు. ఈ మేరకు మంగళవారం అనపర్తి ఏరియా ఆస్పత్రి ఆవరణలో ప్రభుత్వ ఉద్యోగులతో 'రండీ...టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చాంబర్లేన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.రామగురెడ్డి, డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ తరుణ్, కరుణశ్రీ, తిరుమలదేవి, రాంబాబు, ఏపీజీఈఏ అనపర్తి తాలూకా సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

ప్లాంటేషన్‌కు స్థలాలు గుర్తించాలి


అకిరా మియావాకి ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న డ్వామా పీడీ ఉమా మహేశ్వరరావు

సీతానగరం: మండలంలోని ప్రతి గ్రామంలోనూ అకిరా మియావాకి ప్లాంటేషన్లకు స్థలాలను గుర్తించాలని డ్వామా పీడీ ఎ.నాగ ఉమా మహేశ్వరరావు సూచించారు. సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ వారి అకిరా మియావాకి ప్లాంటేషన్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఇదే విధంగా మండలంలో ప్లాంటేషన్ పెంపకానికి 25 సెంట్ల చొప్పున గుర్తించాలన్నారు. పాఠశాలలు, హైస్కూళ్లు, కళాశాలల్లో స్థలాలను చూడడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్లాంటేషన్ సంరక్షణకు ప్రహరీతో పాటు నీటి సదుపాయం ఉండాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.భారతి, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఏపీవో సత్యవతి, ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ వీరబాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలి


జి.మామిడాడలో చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలను మెరుగుపర్చాలని డిప్యూటీ ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లోని డ్రైనేజీల్లో సిల్ట్, రోడ్డు పక్కన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి, ఆ ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లాలన్నారు. దోమల నివారణకు ఏబేట్ మందును పిచికారీ చేయాలన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి సంకాబత్తుల కనక నాగేంద్ర, సబ్బెళ్ల కృష్ణారెడ్డి, శేఖర్, రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ

బిక్కవోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలకు చెందిన జాతీయ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో అగస్టిన్ కుమార్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఉపాధి హామీ కూలీలకు పని కల్పించటంలో ఎలాంటి అవతవకలకు చోటు లేకుండా నూతనగా ఫ్లెస్ విధానం వచ్చిందన్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో ఫ్లెస్ ద్వారా ప్రతి రోజూ రెండు సార్లు హాజరు నమోదు చేయాలన్నారు.

12న నులిపురుగుల దినం


ఆశవర్కర్లతో మాట్లాడుతున్న బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యురాలు దుర్గాదేవి

బిక్కవోలు: మండలంలోని ఈ నెల 12వ తేదీన నిర్వహించే జాతీయ నులిపురుగుల దినాన్ని విజయవంతం చేయాలని బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యులు దుర్గాదేవి అన్నారు. ఆ పీహెచ్ వద్ద మంగళవారం ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దుర్గాదేవి మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో 5,147 మంది విద్యార్థులున్నారన్నారు. 1-19 ఏళ్ల చిన్నారులకు ఈ మాత్రలు వేయాలన్నారు. 12వ తేదీన వేసుకోనివారికి మళ్లీ 20వ తేదీన వేయాలని ఆమె సూచించారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు


గండ్రేడులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శ్రీపద్మావతి

పెదపూడి: బిడ్డకు తల్లి పాలే శ్రేయస్కరమని ఐసీడీఎస్ సంపర సెక్టార్ సూపర్ వైజర్ చింతా శ్రీపద్మావతి అన్నారు. మండలంలోని గండ్రేడు, పుట్టకొండ గ్రామాల్లో మంగళవారం తల్లి పాల వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ శిశువు పుట్టిన గంటలోపు తల్లి పాలు తప్పనిసరిగా తాగిస్తే, బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. రోజుకు 10 నుంచి 12 సార్లు తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డ ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం కలుగుతుందన్నారు.

చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం పార్థసారథి

రంగంపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి అన్నారు. ఈ నెల తొమ్మిది నుంచి 11వ తేదీ వరకు బాపట్లలో రాష్ట్రస్థాయిలో జరిగే సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీలకు ఆ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ విద్యార్థులను అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో రంగంపేట హైస్కూల్ సత్తాను చాటాలని, పీడీ శైలజ ఇచ్చే సూచనలను చిత్తశుద్ధితో ఆచరించి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులను పంపుతూ, మంచి శిక్షణ ఇస్తున్న పీడీ శైలను ప్రశంసించారు. ఎంపికై న విద్యార్థులు కారి నాగభవ్య, దంగేటి కీర్తన, కరాటం జాహ్నవి సాయి వీరలక్ష్మి, కోడూరి యవనలక్ష్మి, సంగిరెడ్డి లక్ష్మణ సాయి, కోనే వీర వెంకట సత్యనారాయణలను అభినందించారు. కార్యక్రమంలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు డాక్టర్ వీసీ జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఏడీబీ రోడ్డు విస్తరణ పనులు


వడిశలేరులో నిర్మిస్తున్న డ్రైనేజీ

రంగంపేట: ఏడీబీ రోడ్డు విస్తరణ పనులను ఇష్టారాజ్యంగా చేపడుతున్నట్టు ఇండియన్ యాక్ట్స్ ఎవేర్నెస్ వలంటరీ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ కుందేటి వెంకట రమణ ఆరోపించారు. ఈ అవకతవకల అభివృద్ధి పనులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా కొలతల ప్రకారం సర్వే చేసి రోడ్డుకు సరిపడా భూమిని సేకరించారన్నారు. దానిలో భాగంగా అడ్డుగా ఉన్న బిల్డింగులు, షాపులను తొలగించారన్నారు. అయితే కొందరు అధికారుల పక్షపాత ధోరణితో వ్యవహరిస్తూ వడిశలేరు సెంటర్‌లో రోడ్డు పక్కన నిర్మిస్తున్న డ్రైనేజీ విషయంలో కొందరికి అనుకూలంగా వ్యవహరిస్తూ ,నచ్చిన చోట ఒక విధంగా, నచ్చని చోట మరో విధంగా వంకర టింకరగా నిర్మిస్తున్నారన్నారు. రోడ్డు విస్తరణలో సేకరించిన భూమి ఎంతవరకు ఉందో అంత వరకు రోడ్డు పక్కన మార్జిన్ తగ్గకుండా ఉండేలా డ్రైనేజీ నిర్మించాలని డిమాండ్ చేశారు. రోడ్డు పక్కన మార్జిన్ వదలకుండా డ్రైనేజీ నిర్మిస్తే భవిష్యత్తులో అనేక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత సేకరించిన భూమిని విడిచిపెట్టి రోడ్డుకు దగ్గరలోనే ఎడ్జ్ లేకుండా డ్రైనేజీ నిర్మించడంపై పలు ప్రమాదాలు జరుగుతాయని కలెక్టర్‌కు వివరించినట్టు చెప్పారు. తక్షణమే అధికారులు పరిశీలించి రోడ్డుకు, డ్రైనేజీకి మధ్య మార్జిన్ తగ్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నష్టపరిహారం అందించి సేకరించిన భూమిని విడిచిపెట్టి డ్రైనేజీని రోడ్డుకు దగ్గరగా ఎందుకు నిర్మిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు.

ఖరీఫ్ సాగులో మెళకువలు పాటించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

సీతానగరం: ఖరీఫ్ వరిసాగులో మెళకువలు పాటించాలని రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ రైతులకు సూచించారు. వంగలపూడిలో ఏడీఏ జయరామలక్ష్మి అధ్యక్షతన మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట నరసింహారావు మాట్లాడుతూ వరిలో సాగు, సమగ్ర ఎరువుల వాడకం, అవసరం మేరకు సస్యరక్షణ మందులు వాడితే స్థిరమైన దిగుబడులు పొందవచ్చన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ సార్వా వరిలో ఎరువులు నారుమడిలో, ప్రధాన మడిలో వేయాల్సిన మోతాదులు వివరించారు. కార్యక్రమంలో ఏవోలు గౌరీదేవి, రామ తులసి, సూర్య రమేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మంగళ గౌరీ వ్రతాలు


అనపర్తిలో మంగళ గౌరీ వ్రతంలో పాల్గొన్న మహిళలు


పందలపాకలోని గౌరీ శంకర ఆలయం వద్ద.. బిక్కవోలు మండలంలో..

అనపర్తి: పాత ఊరిలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళ గౌరీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని వేద పండితుడు రెడ్డి సీతారామశర్మ బ్రహ్మత్వంలో ఆలయ అర్చకులు బాదంపూడి కాశీరామలింగేశ్వర శర్మ, కామేశ్వర శర్మ, సత్యప్రకాష్ శర్మల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి, సామూహిక మంగళగౌరీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బిక్కవోలు: శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున మహిళలు కాలువలకు వెళ్లి స్నానాలు చేశారు. సామూహిక కుంకుమ పూజలు, మంగళ గౌరీ వ్రతం ఆచరించారు. బిక్కవోలు, బలభద్రపురం, కొమరిపాలెం, పందలపాక గౌరీశంకరులు, కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వార్ల ఆలయాల వద్ద ఉన్న స్నానాల రేవుల్లోనూ, కొంకుదురు బుడతల మామిడి వద్ద త్రిముఖలింగేశ్వరుని ఆలయం వద్ద గల పుష్కరిణిలో రద్దీ ఏర్పడింది.

కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు



బిక్కవోలు: స్థానిక కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం భారీగా అభిషేకాలు నిర్వహించారు. శ్రావణ మాసంలో రెండో మంగళవారం, ఏకాదశి కావడంతో ఈ కార్యక్రమం జరిపారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయం ఈవో రామలింగ భాస్కర్, సిబ్బంది నామాల ప్రసాద్, సత్తిబాబు, కోళ్ల వీర కుమార్ తదితరులు పాల్గొన్నారు.